


# వెల

మల్లాది వెంకటకృష్ణమూర్తి

గుర్నాధం బస్‌స్టాప్‌లో తన భార్య కోసం ఎదురుచూస్తూ నిల్చుని వున్నాడు. అదే బస్‌స్టాప్‌లో అతనికి కొద్ది దూరంలో నిలబడివున్న ఓ అందమయిన అమ్మాయి వంక అప్పుడప్పుడు దొంగతనంగా చూస్తున్నాడు గుర్నాధం, అలవాటు ప్రకారం. అతని మగబుద్ధిని గమనించిందా అమ్మాయి కూడా!

ఓసారి తన చేతిగడియారం వంక చూసుకొని అలవోకగా నవ్వింది అమ్మడు గుర్నాధం మొహంలోకి చూస్తూ. తర్వాత అడిగింది.

"నెంబర్ రెండు బస్ ఎప్పుడు వస్తుంది?"

"రావాలి."

"ఆ బస్ కోటీకి వెళ్తుందా?"

"ఉహూం!"

"నేను కోటీకి వెళ్ళాలి. ఏ బస్ ఎక్కాలి?"

"ఒకటో నెంబర్ బస్ వెళ్తుంది."

గుర్నాధానికి ఆ అమ్మాయి మాట్లాడిన తీరు, పైట సద్దుకున్న విధానం, నవ్విన రీతి బట్టి ఆ అమ్మాయి నిజంగా కోటీ వెళ్ళడానికి ఆ బస్‌స్టాప్‌కి రాలేదని, కస్టమర్స్ కోసం వచ్చిందని అర్థమయ్యింది.

తనూ ఓసారి రిస్ట్‌వాచ్ వంక చూసు

కున్నాడు. సినిమా టైం అవుతోంది.

"వస్తారా? రాత్రంతా వుంటాను. డెబ్బయిరూపాయిలున్నాయా?"అడిగింది మెల్లిగా.

గుర్నాధం తల అడ్డంగా వూపాడు. కొద్దిసేపు పెదమొహం పెట్టుకుని వించుంది. తరువాత చిన్నగా ఆవలించి అడిగింది మళ్ళీ నెమ్మదిగా.

"పోనీ నలభై వున్నాయా? మూడు గంటలుండొచ్చు" గుర్నాధం ఇబ్బందిగా మొహంపెట్టి మళ్ళీ తల అడ్డంగా తిప్పాడు డబ్బు లేదన్నట్లుగా.

"పాతిక వుందా? ఓ గంట........"

గుర్నాధం జేబులో పదిహేను రూపాయలే వున్నాయి. తన భార్యతో సినిమాకి వెళ్ళాలనుకొని ఆవిడకోసం ఎదురు చూస్తున్నాడు బస్‌స్టాప్‌లో. సినిమాకి తీసుకెళ్ళమని ఆ పుదయమే అడిగితే, ఆఫీస్ అయాక తనని ఆ బస్‌స్టాప్ దగ్గరికి వచ్చి కలుసుకోమ్మని, ఇద్దరూ కలసి పక్కనే వున్న సినిమాకి వెళ్ళొచ్చని చెప్పాడు. తన భార్య ఇంకా రాలేదు. ధైర్యం చేయదలచుకున్నాడు గుర్నాధం. చిన్నగా దగ్గి, ఆ అమ్మాయివైపు తిరిగి అన్నాడు, "పదిహేనే వున్నాయి నా దగ్గర. గంట ...." ఆ అమ్మాయి ఈసడింపుగా చూసింది గుర్నాధం వంక.

"పాతికకి తక్కువ అయితే గిట్టదు" అన్నది కోపంగా.

గుర్నాధం మాట్లాడలేదు. ఆ అమ్మాయి కొన్ని నిముషాల తర్వాత పక్కన బస్‌స్టాప్ వైపు వెళ్ళిపోయింది.

రెండు నిముషాల తర్వాత గుర్నాధం భార్య రిక్షాలోంచి దిగింది హడావుడిగా.

"ఎందుకైంది ఇంత ఆలస్యం? త్వరగా పద" అన్నాడు గుర్నాధం భార్య మీద విసుక్కుంటూ.

ఇద్దరూ సినిమా థియేటర్‌లోకి వెళ్ళారు. కాని అప్పటికే "హౌస్ ఫుల్" బోర్డ్ పెట్టేసారు.

"ఇంకేంచేస్తాం? పదండి ఇంటికి పోదాం" అన్నది గుర్నాధం భార్య.

ఇల్లు అరమైలు లోపే వుండటంవల్ల ఇంటికి కాలినడకన బయలుదేరారు ఇద్దరూ.

తర్వాతి బస్‌స్టాప్ దగ్గర నిలబడి వున్న ఆ అమ్మాయి దూరం నుంచే వస్తున్న గుర్నాధాన్ని, అతని పక్కన మాట్లాడుతూ వస్తున్న అతని భార్యని చూసింది. గుర్నాధం అలవాటు ప్రకారం బస్‌స్టాప్‌లో నిలబడ్డ ఆడపిల్లల వంక - ఆ అమ్మాయి వంక చూసాడు.

ఆ అమ్మాయి తనని పలకరిస్తుందేమోనని భయపడ్డాడు. అతను అనుకున్నంతా అయ్యింది. ఆ అమ్మాయి గుర్నాధం భార్య వంక పరిశీలనగా చూసి, చిన్నగా వ్యంగహాసంచేసి చెప్పింది గుర్నాధంతో.

"గంటకి అయిదిచ్చినా దండగే."